## జూరాల కింద ప్రశ్నార్థకంగా మారిన సాగు

# అన్నదాత అయోమయం

- వానకాలం సీజన్‌లో వారబందితో కాల్వలకు నీటి విడుదల
- ప్రాజెక్టులో తగ్గుముఖం పట్టిన నిల్వలు
- యాసంగి పంటకు నీటి సరఫరాపై సందిగ్ధత
- నేడు హైదరాబాద్‌లో ఎస్‌సీఐడబ్ల్యూఏఎం సమావేశం
- సాగు, తాగునీటి కేటాయింపులపై చర్చ

వనపర్తి, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : వానాకాలం వరి పంట చేతికి రాగా, యాసంగి సాగు రైతులను సందిగ్ధంలోకి నెట్టింది. ప్రధానంగా జూరాల ప్రధాన ఎడమ కాల్వపై ఆధారపడి యాసంగి సిస్తులు చేసే రైతన్నలు ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్నారు. ప్రస్తుతం వానాకాల సీజన్ వరి కోతలు దాదాపు ముగియగా, యాసంగి సాగులో వరికి బ్రేక్ పడినట్లుగానే భావిస్తున్నారు. జూరాల ప్రాజెక్టులో నీరు అంతంత మాత్రమే ఉండటంతో వచ్చే మరో మూడు నెలల పాటు యాసంగిలో వరికి సాగునీరందించడం కష్టమన్న వాదనలు వినిపిస్తున్నాయి. జూరాల ప్రధాన ఎడమ కాల్వ దాదాపు 100 కిలోమీటర్ల పొడవునా 10 మండలాలు కలుపుకొని జూరాల డ్యాం నుంచి సుమారు పెంట్లవెల్లి మండలం వరకు ఉంది. అధికారికంగా 70వేల ఆయకట్టు ఉంటే, అనధికారికంగా మరో 30వేల ఎకరాలు మోటర్ల ద్వారా సాగులోకి వస్తున్నది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో మంగళవారం నాటికి 4.380 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, కుడి కాల్వకు 325 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 401 క్యూసెక్కులు, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు మరో 300 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఎగువ నుంచి 1,092 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 1,543 క్యూసెక్కుల నీటిని పంట కాల్వలకు బయటకు పంపుతున్నారు.

**యాసంగి ప్రశ్నార్థకమే..**

యాసంగిలో జూరాల కాల్వలకు నీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది. ప్రాజెక్టులో నీటి నిల్వలు సమృద్ధిగా లేకపోవడంతో రెండవ పంట సాగు సందిగ్ధంలో పడింది. దాదాపు నెలరోజులకుపైగా జూరాల కాల్వల కింద వరికోతలు జరుగుతున్నాయి. చివరి దశకు రావడంతో మరో పక్షం రోజుల్లో ముగిసిపోనున్నాయి. అయితే, యాసంగిలో జూరాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కష్టమేనన్న అభిప్రాయం వెల్లడవుతున్నది. ఎగువన నారాయణపూర్ డ్యాం కింద కూడా యాసంగిలో సాగు చేయడం లేదని తెలుస్తున్నది. డ్యాంలో నీటి పరిస్థితులను బట్టి అక్కడ కూడా రెండో పంటకు నీటి విడుదలపై సందిగ్ధమే నెలకొంది. నారాయణాపూర్ డ్యాం కింద రెండవ పంట సాగైతే, దిగువన జూరాలకు కొంత నీరు వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న సమాచారాన్ని బట్టి కర్ణాటకలో కూడా రెండో పంటసాగు నిర్ణయించకపోగా, ఊగిసలాటనే ఉంది. దీంతో అంతంత మాత్రమే నీటి నిల్వలు ఉన్న జూరాల కింద యాసంగి సాగుబడులు ప్రశ్నార్థకమేనన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.




**వానకాలం పంటలకే వారబంది..**

జూరాల ప్రాజెక్టు కింద వానకాలం పంటలకే వారబంది ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఈ మధ్యకాలంలో తలెత్తలేదని రైతులు చెబుతున్నారు. దాదాపు రెండు నెలల నుంచి వానకాలం వరిసాగుకు వారబంధి ద్వారానే నీటిని అందిస్తూ వచ్చారు. వారంలో మూడు రోజులు మాత్రమే కాల్వలకు నీటి విడుదల చేస్తున్నారు. జూరాల కింద రైతులు ప్రతి ఏటా రెండు పంటలు పండించుకుంటూ వస్తున్నారు. ఈ ఏడాది వానాకాలంలో వర్షాల పరిస్థితి అంతంత మాత్రంగా ఉంది. భారీ వర్షాలు, వరదలు లేనందునా జూరాల కింద ఒక పంటకే నీటి విడుదల జరుగుతూ వచ్చింది. ఈ పరిస్థితుల్లో యాసంగిలో క్రాఫ్ హాలిడే అన్న పరిస్థితులే కనిపిస్తున్నాయి.

**చెరువులు, బోర్లకింద..**

వానకాలంలో ముందుగా సాగు చేసుకున్న రైతులు రెండో పంటకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ నెలలోనే కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి కోతలు పూర్తి చేసుకున్నారు. ప్రాజెక్టుల ద్వారా అక్కడక్కడా చెరువులను నింపుకొన్నారు. అలాగే బోరుబావులు సైతం నీటిని సమృద్ధిగానే అందిస్తున్నాయి. ఈ క్రమంలో కేవలం వీటి ఆధారంగానే యాసంగిలో వరినాట్లు వేసుకునే పరిస్థితి ఉంది. వరుసగా నాలుగేండ్లుగా నీటి సౌకర్యాలు మెరుగవడంతో జిల్లాలో యాసంగిలోనూ భారీగా సాగు బడికి అవకాశం ఉన్నది. ఈసారి ఎన్నికల కోలాహలం ముగిసిన అనంతరం యాసంగి పనులు మరింత వేగవంతమయ్యాయి. నారుమడులు సిద్ధం చేసుకోవడం, నారు సిద్ధమైన రైతులు నాటేందుకు మడులు సిద్ధం చేయడంలాంటి పనుల్లో నిమగ్నమయ్యారు.

### నేడు సమావేశం..

ప్రాజెక్టుల కింద యాసంగిలో సాగుబడులకు సంబంధించి హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని ఇరిగేషన్ ఈఎన్‌సీ కార్యాలయంలో బుధవారం స్టేట్ లెవల్ కమిటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ వాటర్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్ కమిటీ మీటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఈఎన్‌సీలు, అడ్మినిస్టేటివ్ ఈఎన్‌సీలు, సీఈలు, ఎస్ఈలు పాల్గొని ప్రాజెక్టుల్లోని నీటి పరిస్థితులపై చర్చించి ఓ నిర్ణయానికి రాబోతున్నారు. ఈ సమావేశం అనంతరం స్థానికంగా జూరాల అధికారులు మంత్రులు, ఎమ్మెల్యేల సమక్ష్యంలో ఇరిగేషన్ బోర్డు సమావేశాన్ని ఏర్పాటు చేసి నిర్ణయాలను వెల్లడించే అవకాశం ఉన్నది. ఇదిలా ఉంటే, ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వ, ఎగువ నారాయణాపూర్ డ్యాం నుంచి వచ్చే నీటి అంచనాలను వేసుకుని యాసంగి సాగుబడులను నిర్ణయిస్తారు. కాగా, వచ్చే ఎండాకాలానికి అవసరమైన తాగునీటిని కూడా అధికారులు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. మార్చి 30వ ఏదీ తర్వాత ప్రాజెక్టుల్లో సాగుబడులకు నీటిని విడుదల చేసే పరిస్థితులు ఉండవు. అప్పటికే ప్రాజెక్టుల్లో తాగునీటి కోసం కేటాయించిన లెవెల్స్ వరకే నీటిని తీసుకోవాల్సి ఉంది. వీటన్నిటినీ పరిశీలించిన అనంతరం ఆయా జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో ఇరిగేషన్ బోర్డు సమావేశం నిర్వహించి సాగు వివరాలను వెల్లడించనున్నారు.

### నారుమడికి సమయం మించిపోతుంది..



యాసంగి వరిపంటకు నారుమడి పోసుకునే సమయం దాటిపోతున్నది. ఇంత వరకు సారోళ్లు అమరచింత ఎత్తిపోతల పథకం అయకట్టు కాల్వకు సాగు నీటిని విడుదల చేయలేదు. తొమ్మిదేండ్లుగా ఈ ఎత్తిపోతలతోనే సాగు చేస్తుంటిమి. ప్రతి యేడు నవంబర్ మొదటి లేదా రెండో వారంలో నారుమడికి నీటిని వదిలేటోళ్లు. ఈ ఏడాది డిసెంబర్ రెండో వారం దాటిపోతున్నా నీళ్ల గురించి ఏం చెప్తలేరు. రాబోయే కాలంలో తాగునీటి లేకుంటే మళ్లా పాతకాలం రోజులు కండ్ల ముందు కనపడుతున్నయి.

**- కారెడ్డి నాగరాజు, రైతు, అమరచింత, వనపర్తి జిల్లా**

### నీళ్లిచ్చేది, లేనిది చెప్పాలి..



ఎప్పుడు లేనిది వారబంధి పద్ధతిలో నీటిని విడుదల చేయడంపై గోపల్‌దిన్నె రిజార్వాయర్ ఆయకట్టు రైతులందరం ఆందోళన చెందుతున్నాం. వీపనగండ్ల, చిన్నంబావి మండలాల ప్రజలు ఈ నీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉన్నది. ఇప్పటికే బోరుబావులపై ఆధారపడుతున్న కొంత మంది రైతులు యాసంగి పంట కోసం ఇప్పటికే నారు పోస్తున్నరు. రిజర్వాయర్ నీటిపై ఆధారపడి రైతులు అయోమయంలో పడ్డారు. అధికారులు నీళ్లిస్తారో, లేదో తెలపాలె.

**- ఈర్ల ఈశ్వరయ్య, రైతు, గోవర్ధనగిరి, వీపనగండ్ల మండలం**

### నీటి నిల్వ ఆధారంగా నిర్ణయం..

జూరాల కింద సాగుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. హైదరాబాద్‌లో నేడు జరిగే సమావేశం అనంతరం అన్ని విషయాలు తెలుస్తాయి. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని యాసంగిపై నిర్ణయాలు తీసుకోవాల్సి ఉన్నది. ఆయా ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వల ఆధారంగానే సమావేశంలో నిర్ణయాలు ఉంటాయి. ఆ తర్వాతే నీటి విడుదలపై స్పష్టత వచ్చే అవకాశమున్నది.

**- సత్యశీలారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ, వనపర్తి సర్కిల్**

### యాసంగికి నీరు వదులుతారో లేదో..

యాసంగికి జూరాల నీరు వదులుతారో లేదో అయోమయంగా ఉంది. మొన్నటిదాంక వారబంధి అన్నరు కానీ ఇప్పటి పరిస్థితులు అట్ల కనిపించడం లేదు. వానలు లేకపోవడం వల్ల ప్రాజెక్టుల్లో నీళ్లు లేవని చెబుతున్నరు. సాగు చేసినంక నీటి పరిస్థితి ఏంటో చెప్తలేరు. నారు పోసుకోనీకె కూడా రైతులు సంశయిస్తున్నరు.

**- హుస్సేనయ్య, రైతు, పాతపల్లి, పెబ్బేరు మండలం**



# కిక్కిరిసిన కురుమూర్తిగిరులు

దేవరకద్ర రూరల్, (చిన్నచింతకుంట) డిసెంబర్ 12 : పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కార్తీక అమావాస్య సందర్భంగా మంగళవారం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలిరావడంతో కురుమూర్తి గిరులు జనసంద్రమయ్యాయి. వచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి బారులుతీరారు. భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా కురుమూర్తి స్వామిని ప్రజలు కొలుస్తారు. ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, కొత్త కుండలో నైవేద్యాలు తయారు చేసి స్వామివారికి సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి దర్శనం కోసం మెట్ల ద్వారా వెళ్లి ఉద్దాల మండపంలో ఉద్దాలను దర్శనం చేసుకొని, గర్భగుడి వద్ద స్వామి దర్శనం చేసుకున్నారు. గోవింద నామస్మరణతో కాంచన గుహ మార్మోగింది. జాతరలో దుకాణాలు వివిధ రకాల స్వీట్లు, వస్తువుల కొనుగోలుతో సందడిగా కనిపించాయి.



పూజలు చేస్తున్న భక్తులు

## బీచుపల్లిలో అమవాస్య పూజలు



బీచుపల్లి క్షేత్రంలో అంజన్నను దర్శించుకునేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు

ఇటిక్యాల, డిసెంబర్ 12 : కార్తీకమాసం ముగింపు సందర్భంగా మంగళవారం బీచుపల్లి క్షేత్రవలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మారుతాచారి, సందీపాచారి స్వామివారికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, తీర్థప్రసాదాల నివేదన, మహామంగళహారతి కార్యక్రమాలను నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి రామన్‌గౌడ్ పర్యవేక్షించారు.

## జగ్గజ్జననీ నమోస్తుతే..



అలంపూర్ అమ్మవారి ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

అలంపూర్, డిసెంబర్ 12 : కార్తీకమాసం అమావాస్య సందర్భంగా అలంపూర్‌లోని ప్రముఖ శైవక్షేత్రమైన జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీకమాస చివరి రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి ఆలయంలో అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో పురెందర్‌కుమార్ భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.



పూజలు చేస్తున్న భక్తులు

## భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు

అలంపూర్, డిసెంబర్ 12 : మండలంలోని లింగనవాయిలో వెలిసిన నిత్యానందస్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో వెలిసిన స్వయంభూ శివలింగానికి అభిషేకం, అర్చనలు కొనసాగాయి. ప్రముఖ వక్తలు ఆధ్యాత్మిక ప్రవచనాలు చదివి వినిపించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు వికాస భారతి ఆద్వర్యంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థుల ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి.

- ఓటరు జాబితా సవరణకు అవకాశం
- జనవరి నాటికి 18ఏండ్లు నిండితే ఓటు హక్కు
- లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఈసీ చర్యలు
- 20 నుంచి ప్రక్రియ ప్రారంభం
- బూత్‌స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు

# మరో చాన్స్

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : ఓటరు జాబితా సవరణకు ఎన్నికల సంఘం మరోసారి శ్రీకారం చుట్టింది. ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు ముగియగా, సాధారణ సవరణలో భాగంగా లోక్‌సభ ఎన్నికలు కూడా ఉన్న నేపథ్యంలో కొత్త ఓటర్ల నమోదు చేపట్టనున్నది. జనవరి 1వ తేదీ నాటికి 18ఏండ్లు నిండిన యువతకు ఓటరుగా నమోదు చేయనుండడంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలూ ఉండటంతో కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది.

**మరోసారి ఓటర్ల జాబితా సవరణ..**

అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో జనవరిలో పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, పురపాలికలతోపాటు లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18ఏండ్లు నిండిన యువతకు ఓటరుగా పేరు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీనికి సంబంధించి ఇటీవలే షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం ఓటర్ల నమోదుతోపాటుగా బోగస్ ఓట్ల తొలగింపు, చిరునామాల మార్పులు చేసుకోవచ్చు. ఇలా రూపొందించిన ఓటర్ల జాబితా తుది ప్రక్రియను ఫిబ్రవరి 8వ తేదీ నాటికి పూర్తి చేయనున్నది. ఓటు నమోదు కోసం బీఎల్‌వోలతోపాటు ఆన్‌లైన్‌లోనూ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఈ క్రమంలో 18ఏండ్లు నిండిన యువత పేర్లు సేకరించేందుకు బీఎల్‌వోలు ఇంటింటినీ సందర్శిస్తారు. కొత్తగా ఫారం-6లో దరఖాస్తు ఇస్తే బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అలాగే ఓటరు గుర్తింపు కార్డు చిరునామా, తప్పుల సవరణకూ ఇందులో అవకాశం ఉంది. ఓటరు జాబితాలతో పాటు పోలింగ్ కేంద్రాల్లోనూ క్రమబద్ధీకరించనున్నారు. కాగా, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో అధికారులు ఓటరు సవరణను పర్యవేక్షించనున్నారు. ముఖ్యంగా విద్యా సంస్థల్లో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో 18సంవత్సరాలు నిండిన యువత నుంచి అక్కడికక్కడే దరఖాస్తులు స్వీకరించి ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తారు. ఇంతకు ముందులా బూత్ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రారంభించనున్నారు. జనవరి 5వ తేదీలోగా కొత్త దరఖాస్తులను పరిశీలించడం, మార్పులు, చేర్పులు చేపడతారు. 6వ తేదీన ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. 22వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుంది. వాటిని పరిశీలించిన అనంతరం మరోసారి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టి ఫిబ్రవరి 8వ తేదీన తుది జాబితాను జిల్లా ఎన్నికల సంఘం అధికారులతో విడుదల చేయడం జరుగుతంది. తాజాగా నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన తప్పిదాలను ఈ సవరణలో పునరావృతం కాకుండా ఎన్నికల అధికారులు బీఎల్‌వోలకు ఆదేశాలు జారీ చేయనున్నారు. వచ్చే సంవత్సరం పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్లకు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు చివరగా ఎంపీ ఎన్నికలూ జరగనున్నాయి. దీంతో ఓటరు నమోదు పూర్తిస్థాయిలో జరిగేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోనున్నారు.



| నాగర్‌కర్నూల్ జిల్లా ఓటర్ల వివరాలు.. | |
|---|---|
| నియోజకవర్గం | ఓటర్లు |
| నాగర్‌కర్నూల్ | 2,32,780 |
| కొల్లాపూర్ | 2,34,167 |
| కల్వకుర్తి | 2,41,762 |
| అచ్చంపేట | 2,33,565 |
| మొత్తం | 9,42,274 |

### 20నుంచి ఓటరు జాబితా సవరణ..

ఈనెల 20వ తేదీ నుంచి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తాం. వచ్చే సంవత్స రం లోక్‌సభకు, ఇతర స్థానిక సం స్థలకు ఎన్నికలు జరుగుతాయి. ఇప్పటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసిన ఓటర్లు అడ్రస్‌లు, పో లింగ్ కేంద్రాల మార్పుతోపాటు ముఖ్యంగా జనవరి 1నాటికి 18ఏండ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయడం ఈ సవరణ ఉద్దేశం.

**- ఉదయ్‌కుమార్, కలెక్టర్, నాగర్‌కర్నూల్**



- తాంత్రిక పూజల నెపంతో 11 మంది హత్య
- పాయిజన్ బాటిల్స్, ఫోన్లు, సిమ్‌కార్డులు, కారు స్వాధీనం
- జోగుళాంబ గద్వాల డీఐజీ ఎల్‌ఎస్.చౌహాన్

# సీరియల్ కిల్లర్ అరెస్ట్

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 12 : అమాయకులను, వితంతువులను నమ్మించి మోసం చేయడమే కాకుండా 11హత్యలు చేసిన మాంత్రికుడు రామటి సత్యనారాయణ అలియాస్ సత్యంయాదవ్ అలియాస్ సత్యనారాయణస్వామిని నాగర్‌కర్నూల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు జోగులాంబ గద్వాల డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ ఎస్పీ కార్యాలయంలో విలేకరుల ముందు నిందితుడిని హాజరుపరిచారు. నిందితుడు నాగర్‌కర్నూల్ జిల్లాలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ పలు హత్యలు చేసి అంతరాష్ట్ర హంతకుడిగా మారినట్లు వెల్లడించారు. ఈమేరకు డీఐజీ చౌహాన్ సత్యనారాయణ పేరుమోసిన హంతకుడిగా పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన గోవుల వెంకటేశ్‌తోపాటు 11మంది అమాయకులను కిరాతకంగా హతమార్చినట్లు పేర్కొన్నారు. ఇతని నుంచి మృతిచెందిన వ్యక్తులకు చెందిన 5సెల్‌ఫోన్లు, నిందితుడు ఉపయోగించిన 8 సెల్‌ఫోన్లు, 10 సిమ్‌కార్డులు, టీఎస్ 31సీ 3689 నెంబర్ గల షిఫ్ట్ కారు, విషపూరితమైన పదార్థాలను కలిగిఉన్న పెట్టెలు, సీసాలు, 5 ఎలక్ట్రికల్ డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌కు చెందిన బాలికతోపాటు ముగ్గురు వ్యక్తులు, నాగర్‌కర్నూల్ పీఎస్ పరిధిలో ఇద్దరు, కొల్లాపూర్ పీఎస్ పరిధిలో ఒకరు, కల్వకుర్తి పీఎస్ పరిధిలో ఒకరు, కర్ణాటక రాష్ట్రంలోని బలగనూరు పీఎస్ పరిధిలో ఓ మహిళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం లల్లా పెద్దవడుగూరు పీఎస్ పరిధలో ఒకరిని హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు డీఐజీ వెల్లడించారు. గుప్తనిధులు తవ్వకాల పేరుతో అమాయక ప్రజలను మోసం చేసి నమ్మిన వారి నుంచి ప్లాట్లు కానీ, భూములు కానీ రిజిస్ట్రేషన్ చేయించుకునేవాడన్నారు. ఈక్రమంలో తన పని ముగిశాక వారిని వశపరుచుకొని ఏకాంతంగా ఉన్న చోటికి పిలిపించుకొని హత్య చేసేవాడని వెల్లడించారు. పూజలు చేస్తూ తీర్థం పేరుతో వారి నోట్లో యాసిడ్ లేక విష పదార్థాలు పోసి చంపేవాడన్నారు. నిందితుడు ఇప్పటి వరకు ఇక చిన్నారి, మహిళలతోసహా మొత్తం 11 మందిని చంపినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు కర్ణాటకలో 8 కేసుల్లో అతని పాత్ర ఉన్నట్లు గుర్తించామన్నారు. హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్‌కు చెందిన గోవుల వెంకటేశ్ తాను నాగర్‌కర్నూల్‌లో రామటి సత్యనారాయణ వద్దకు వెళుతున్నానని చెప్పి ఐదురోజులైనా తిరిగి రాకపోవడంతో ఆమె ఫిర్యాదు మేరకు చేపట్టిన విచారణలో సత్యంయాదవ్ గుట్టు రట్టయ్యిందని డీఐజీ తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్న సత్యంయాదవ్ తాతల నాటి నుంచి మూలిక వైద్యం ద్వారా క్షుద్రపూజలు నేర్చుకొని పరంపర ఇలాంటి హత్యలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు.

**లంగర్‌హౌజ్‌కు చెందిన వెంకటేశ్ హత్య ఇలా..**

మృతుడు గోవుల వెంకటేశ్, అతడి స్నేహితులు కొల్లాపూర్‌లో గుప్తనిధి కోసం ప్రయత్నిస్తూ సత్యంయాదవ్‌ను సంప్రదించారు. గుప్త నిధిని కనుగొని వెలికితీసే ప్రక్రియలో మరణించే వ్యక్తి తనను సంప్రదించాలని సత్యంయాదవ్ షరతుపెట్టాడు. దీంతో వెంకటేశ్, అతడి స్నేహితుడు అందుకు అంగీకరించారు. నిధిని పొందడానికి ముగ్గురు గర్భిణులను వధించాలని చెప్పాడు. దీంతో వెంకటేశ్ భయాందోళనకు గురై తన డబ్బులు తనకు ఇవ్వాలని సత్యంయాదవ్‌ను అడగడంతో మరో ఉపాయం ఉందని నచ్చజెప్పి గతనెల 3వ తేదీ నాగర్‌కర్నూల్‌కు వెంకటేశ్‌ను రప్పించాడు. సత్యంయాదవ్ ముందుగానే వేసుకున్న పన్నాగం ప్రకారం వెంకటేశ్ సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి మరుసటిరోజు 4వ తేదీన జిల్లేడు పాలు, మరి కొన్ని మూలికలతో విష ద్రావణాన్ని పూజ పేరుతో తీర్థం తాగించాడు. వెంకటేశ్ అపస్మారక స్థితికి వెళ్లాక కారులో జలాల్‌పూర్ గ్రామ శివారులోకి తీసుకెళ్లి నోటిలో యాసిడ్‌పోసి పరారయ్యాడు. సమీపంలోని పొదల్లో చొక్కా, పర్సు పడేసి నాగర్‌కర్నూల్‌కు చేరుకున్నాడు. మోసగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఐజీ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు ఎస్పీ రామేశ్వర్, డీఎస్పీ మోహన్‌కుమార్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై మహేందర్ ఉన్నారు.